క్లుప్తంగా

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే అన్నా



సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే అన్నా

మార్కాపురం: మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి సన్మానించారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

పెద్దదోర్నాల: అనారోగ్యంలో పెద్దదోర్నాలకు చెందిన వీఆర్ఏ షేక్ సుభాన్ (60) శుక్రవారం మృతి చెందారు. సుభాన్ మృతిపై తహసీల్దార్ వేణుగోపాలరావు, ఆర్ఐ నాగేశ్వరరావులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుభాన్ మృత దేహానికి వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు పూర్ణకంటి యాకోబ్, జూనియర్ అసిస్టెంట్ సుజాత నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున మట్టి ఖర్చుల కోసం 25 వేల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు.

424 గృహాలు మంజూరు

పుల్లలచెరువు: మండలంలో ఉన్న 11 గిరిజన గూడేల్లో కలుపుకుని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 424 గృహాలు మంజూరైనట్లు గృహనిర్మాణ శాఖ ఈఈ దాసరి శర్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని కోమరోలులోని గిరిజన గూడేన్ని సందర్శించి వారి గృహాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 424 గృహాలు మంజూరయ్యాయని, వాటిని తమ సిబ్బంది ద్వారా సర్వే చేస్తున్నామని తెలిపారు. ఇంకా ఎవరైనా గృహాలు నిర్మించుకునేలా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం ఒక్కో గృహానికి రూ.2 లక్షల 39 వేలు మంజూరు చేస్తోందని, ఈ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈయన వెంట డీఈ సురేష్‌బాబు, ఏఈ జాన్‌సుందర్‌రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, ప్రకాశ్ పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయాధికారిగా సంగమేశ్వరరెడ్డి



విధులకు హాజరైన సంగమేశ్వరరెడ్డి

దర్శి: స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయాధికారిగా బడే సంగమేశ్వరరెడ్డి నియమితులయ్యారు. గతంలో సంగమేశ్వరరెడ్డి దర్శి, తాళ్లూరు మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించారు. సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

తాళ్లూరు (ముండ్లమూరు): బొద్దికూరపాడు గ్రామానికి చెందిన యలమంద భార్య ఆదిలక్ష్మమ్మకు శుక్రవారం వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైన రూ. 10 వేల నగదు అందించారు. యలమంద ప్రమాదంలో మృతి చెందిగా ఆయనకు రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా మంజూరైనట్లు సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సర్పంచి మందా శ్యామ్సన్, ఉప సర్పంచి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ కొప్పుల బాలకోటయ్య, పీఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, సంగన సుబ్బారెడ్డి, సగిలి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దాతలు సహకరిస్తే మరెన్నో పతకాలు సాధిస్తా

మార్కాపురం రూరల్: మండలంలోని నాయుడుపల్లికి చెందిన ఒంటేరు శ్రావణికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి ఆర్థిక సాయం అందించారు. శ్రావణి వివిధ క్రీడల్లో పతకాలు సాధించి ప్రస్తుతం పీఈటీ మాస్టర్‌గా ట్రైనింగ్ తీసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న వనజాక్షి, మరికొందరు దాతలు కలిసి 9 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ముండ్లమూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ మారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రైతులందరికీ అన్ని రకాల సేవలు అందించడమే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి వారికి అవసరమైన ఎరువులు, వ్యవసాయ పరికరాలు సకాలంలో అందించనున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఫరూక్ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు వివరించారు. సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి రవి వెంకన్నబాబు, పశువైద్యాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం..ఆంధ్రా



గొట్లగట్టులో వాలీబాల్ ఆడుతున్న బాలికలు

కొనకనమిట్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం మండలంలోని గొట్లగట్టులో స్త్రీ, పురుషుల కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ ఫైనల్ పోటీలో గొట్లగట్టు–రేగుమానిపల్లి టీమ్‌లు తలపడగా గొట్లగట్టు విన్నర్‌గా నిలిచింది. బాలికల కబడ్డీలో నాగంపల్లి విన్నర్‌గా, రేగుమానిపల్లి రన్నర్‌గా నిలిచాయి. చినారికట్లలో యువకులు ఉత్సాహంగా క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రజలు ఉత్సాహంగా తిలకిస్తున్నారు. క్రీడా పోటీలను ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, సచివాలయ కార్యదర్శి ప్రసాద్‌లు పర్యవేక్షించారు. పోటీలను పీఈటీలు బాలగురవయ్య, శ్రీనివాసులు, సుఖునాభి, వనజ నిర్వహించారు. విన్నర్‌గా గెలుపొందిన టీమ్‌లు నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాయని ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి అన్నారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌వీకేపీ కళాశాల, ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న వివిధ ఆటల పోటీల్లో క్రీడాకారులు, యువకులు, సచివాలయం సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. పట్టణ పరిధిలోని సచివాలయం పరిధిలో విజేతలైన వివిధ క్రీడల్లోని క్రీడాకారులకు పోటీలను పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో క్రికెట్, బాయ్స్ హైస్కూల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. క్రీడలకు పీడీలు శ్యామల, ఆర్ఓ రంగారావు, పీఈటీలు సుబ్బారావు, ఎంపైర్లు తదితరులు వ్యవహరించి విజేతలను ప్రకటిస్తున్నారు.



మార్కాపురం: ఖోఖో ఆడుతున్న యువకులు

బూచేపల్లికి అభినందనల వెల్లువ



కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

దర్శి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌గా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలను నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందనలు తెలుపుతున్నారు. కార్యాలయంలో అభిమానులు కేకులు తీసుకొచ్చి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వెంకాయమ్మలతో కట్ చేయించి ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘాలు, ముస్లిం నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో చేరుకుని అభినందనలు తెలిపారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, యరమల మధుసూదన్‌రెడ్డి, ఉడుముల వెంకటరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, ముప్పరాజు రవి, రహంతుల్లా, చెవిరెడ్డి రాజారెడ్డి, సందిరెడ్డి రాజశేఖరరెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, మేకల కృష్ణారెడ్డి, రాము, హనుమంతరావు పాల్గొన్నారు.

బూచేపల్లి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

- 14న ముగ్గుల పోటీలు
- 15న ట్రాక్టర్ రివర్స్ పోటీలు

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీన ముగ్గుల పోటీలు, 15వ తేదీన ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరిగే ముగ్గుల పోటీలకు మొదటి బహుమతి ఎయిర్ కండీషనర్, ద్వితీయ బహుమతి వాషింగ్ మిషన్, తృతీయ బహుమతి ఫ్రిజ్, నాలుగో బహుమతి ఎల్ఈడీ టీవీలను బహూకరించనున్నారు. ట్రాక్టర్ రివర్స్ పోటీలకు మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు అందజేస్తున్నట్లు వారి ప్రతినిధి సందిరెడ్డి సరేంద్రరెడ్డి తెలిపారు. మహిళలు, రైతులు పోటీల్లో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

రైతులతో బాధ్యతగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శీనారెడ్డి

రాచర్ల: రైతులతో బాధ్యతగా ఉండాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శీనారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశాన్ని ఎంపీడీవో కె.కవితా చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి మార్చి 2023 వరకూ 516 పనులకు రూ.5.58 కోట్లతో జరిగిన ఉపాధి హామి పనులు, పంచాయతీరాజ్, సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జేపీ చెరువు, చినగానిపల్లె, సోమిదేవిపల్లె, యడవల్లి పంచాయతీల్లో మస్టర్‌లో ఎలాంటి సంతకాలు లేకుండాలే బిల్లులు తీసుకోవడమే కాకుండా కోలతల్లో తేడాలతో బిల్లులు చేసుకున్నారని సామాజిక బృందం సమావేశం దృష్టికి తీసుకొచ్చింది. యడవల్లిలో హార్టికల్చర్‌తో మొక్కలు పెంచకుండానే బిల్లులు మంజూరు చేసుకున్నారని, యడవల్లి, అంకిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన 5 మంది రైతులు 1360 మొక్కలు పెంచుకున్నా వాటికి సంబంధించిన రూ.55,705 బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ఈ విషయంపై అయా గ్రామాలకు చెందిన రైతులు సమావేశంలో పీడీ దృష్టికి తీసుకెళ్లగా రైతులకు ఎందుకు బిల్లులు చేయాలేదని ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జేపీ చెరువు మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై నగదు రికవరీ అదేశించి నోటిసులు జారీ చేయాలని మండల అధికారులకు సూచించారు. డీవీవో ఝాన్సీరాణి, ఏపీవోలు మోసే, వై.సుజాత పాల్గొన్నారు.

మహనీయుడు వివేకానంద



వివేకానందునికి పూలమాలలు వేస్తున్న ప్రొఫెసర్ రాజబాబు

మార్కాపురం: దేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాల్లో చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలల సెక్రటరీ కృష్ణచైతన్య అన్నారు. కిట్స్ కళాశాలలో వివేకానంద జయంతి గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వం వివేకానందుని పుట్టిన రోజున జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో..

డాక్టర్ సామ్యేలు జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని యువజన దినోత్సవంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్



ఓబులక్కపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పొదిలి రూరల్: ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పొదిలి మండలంలోని ఓబులక్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని 209 పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓబులక్కపల్లిలో మొత్తం 789 ఓట్లు ఉన్నాయన్నారు. వారిలో 80 సంవత్సరాలు పైబడిన వారు 7, దివ్యాంగులు 7 ఉన్నట్లు చెప్పారు. వీరిలో 80 సంవత్సరాలు దాటిన వారు,40శాతం పైన అంగవైకల్యం కలిగిన వారు ఎన్నికల ప్రకటన వచ్చిన నాటి నుంచి 10 రోజుల్లో ప్రత్యేక దరఖాస్తును అక్కడ ఉన్న ఆర్వోకు అందజేయాలని చెప్పారు. అలా చేసుకున్న వారికి ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకోనేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కిటికీలు, మంచినీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడలన్నారు. ఆయన వెంట తహసీల్దారు అశోక్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ కృష్ణ, ఎంఈఓ ఎం. శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

మాటపై నిలబడే ఏకైక నాయకుడు సీఎం జగన్



ప్రభపై మాట్లాడుతున్న దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన వెంకాయమ్మ

దర్శి: రాష్ట్రంలో నాయకులు వస్తుంటారు..పోతుంటారు.. మాటమీద నిలబడే ఏకైక నాయకుడు రాష్ట్రంలో, దేశంలో ఆ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే ఈ నాడు ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. జాతీయస్థాయి ఎడ్లపందేల అనంతరం ఏర్పాటు చేసి విద్యుత్ ప్రభపై వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయకుండా మళ్లీ వచ్చి ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని టీడీపీ నాయకులను ఉద్దేశించి ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూశారన్నారు. ఒక్కరూపాయి కూడా దళారులకు చేరకుండా నేరుగా పేదల ఖాతాలకు చేరుస్తున్న సీఎం అభినందనీయుడన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175కి 175 సీట్లు గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. తమ కుటుంబం జగనన్న రుణం తీర్చుకోలేనిదని, తమపై ప్రేమతో అమ్మకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, తనకు దర్శిలో పోటీ చేసే అవకాశం ఇచ్చినందుకు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, ఇత్తడి దేవదానం, గోళ్లపాటి మోషే, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, నాయకులు చంద్రగిరి గురవారెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, కర్జా శ్రీనివాసరెడ్డి, దామెర్ల చంద్రం, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గోదాదేవికి 108 గంగాళాలతో పాయసం నివేదన



చెన్నకేశవ స్వామి ఆలయంలో ముస్తాబైన అమ్మవారు

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారి ఆలయంలో అమ్మవారికి కూడా 27వ పాశురం విశేష పూజలు నిర్వహించారు. గోదాదేవికి 108 గంగాళలతో పాయసం అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళ వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈవో శ్రీనివాసరెడ్డి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే కేపీని కలిసిన విద్యుత్ ఉద్యోగులు



ఎమ్మెల్యే కేపీతో విద్యుత్ శాఖ ఏడీఈ, డీఈలు

మార్కాపురం: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో విద్యుత్ ఉద్యోగులు కలిశారు. ఏడీఈ షియానాయక్, ఏఈలు సుబ్బరాయుడు, హనుమానాయక్, సిబ్బంది కలిసి బొకే ఇచ్చి సన్మానించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగుల క్యాలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే కేపీ వారికి సూచించారు.

కంచి కామకోటి పీఠం సేవలతో మరింత అభివృద్ధి

- సనాతన ధర్మ సేవ గ్రామాన్ని పరిశీలించిన కలెక్టర్



ఆరామా క్షేత్రానికి స్థలం కావాలని అర్జీ ఇస్తున్న బ్రహ్మణులు

పొదిలి రూరల్: కంచి కామకోటి పీఠం చేస్తున్న సేవలతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పొదిలి మండలం ఓబులక్కపల్లి సమీపంలో కంచి కామకోటి పీఠం అధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సనాతన ధర్మ సేవ గ్రామాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు కంచి కామకోటి పీఠం కృషి చేస్తోందని, దానికి అనుగుణంగా అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఓబులక్కపల్లి గ్రామంలో సర్వే నెంబరు 59–3లో 31 ఎకరాల్లో రూ.30 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అందులో 500 కెపాసిటి ఉన్న 6 నుంచి 12 తరగతుల పాఠశాల, వేద పాఠశాల పేద పిల్లలకు మంచి విద్యను అందించడం, స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటరు, గోశాల, గ్రౌండ్, తాగునీరు కోసం ఆర్వో ప్లాంట్, సోలర్ సిస్టం ఏర్పాటు, వ్యవసాయ పంటలు పండించనున్నట్లు పేర్కొన్నారు. ఇంత గొప్ప ఆలోచనతో మంచి కార్యక్రమాలు చేస్తున్న కంచి కామకోటి పీఠాన్ని కలెక్టర్ అభినందించారు. గ్రామ చెరువును అమృతసర్ పథకంలో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పొదిలిలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థకు చెందిన ఫీజర్స్, రథం నిలుపుకోవడానికి స్థలం కావాలని ఆ సంస్థ సభ్యులు కాకునూరి యలమందారెడ్డి, బండి అశోక్‌లు అర్జీ ఇచ్చారు.పొదిలిలో బ్రహ్మణులకు ఆరామా క్షేత్రం లేక ఇబ్బంది పడుతున్నారని, ఆరామా క్షేత్రానికి స్థలం కేటాయించాలని బ్రహ్మణులు విన్నవించుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ కృష్ణ, ఎంఈఓ ఎం. శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి పద్మ, వీఆర్వో బాల వెంకటరెడ్డి, కంచి కామకోటి పీఠం సభ్యులు ఉన్నారు.

IN THE COURT OF HON'BLE IV Addl. District Judge:: KURNOOL

O.S. No. 108/2017

G.Giridhar .... వాది

-Vs-

S.Chandra Mohan Reddy & Others .... ప్రతివాదులు

12,14 మరియు 16,17వ ప్రతివాదికి నోటీసులు

(12) Triveedhi Manikanta, S/o Mallikarjuna, H.No. 11-86, Main Bazar, Kambam Post, Prakasam District.

(14) N.Lakshmi W/o Naresh Kumar Reddy, H.No. 4-384-32, Sujendra Nagar, Mantralayam (P), Kurnool District.

(16) Battula Rajasekhar Reddy, S/o Battula Nagireddy, H.No. 80-112-7-9-1, Endowment Colony, Kurnool City

(17) Reddy Vamsi Krishna Reddy C/o Reddy Venkata Rangareddy, H.No. 2/2, Kapa Street, Kandahall (V), Peddakaduburu (M), Kurnool District.

పైన తెలిపిన వారి 12,14 మరియు 16,17వ ప్రతివాదులు అయిన మీపైన పై కోర్టులో దావాను దాఖలు చేసినారు. పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు నిమిత్తం 23-01-2024వ తేదీన వాయిదా వేసివున్నారు. పై దావాకు సంబంధించి మీకు ఏమైనా అభ్యంతరాలు వున్న యెడల 23-01-2024 తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ఎదుట మీరు స్వయంగా కానీ, మీ వకీలు ద్వారా కానీ, హాజరై ఏమైన అభ్యంతరాలు వున్న యెడల తెలుపుకోనవలెను, లేని యెడల పై కోర్టు వారు పై దావాను మీ పరోక్షములో విచారించి తీర్మానించుదురని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు వాయిదా 23-01-2024

యం.డి.వి.బోగయ్య శర్మ,
అర్జీదారు/ వాదివరం న్యాయవాది, కర్నూలు

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

బొద్దికూరపాడు (ముండ్లమూరు): తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడులో శుక్రవారం జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి మందా శ్యామ్సన్, ఉప సర్పంచి పులి ప్రసాద్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు మౌనిక, హైదవి, వినోద్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొని 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎంపీటీసీ బాల కోటయ్య, పీఎంసీ చైర్మన్ క్రిష్టా రెడ్డి, సంగన యోగి రెడ్డి, రిటైర్డు హెచ్ఎం సన్నపు రెడ్డి అంజి రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

మార్కాపురం రూరల్: ఆరోగ్య శ్రీలో అర్హులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం మండలంలోని బోడపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 నుంచి రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. ఆరోగ్య శ్రీతో పేదల జీవితాలకు భరోసా లభించిందన్నారు. స్పెషలిస్టు వైద్యులు బాలీశ్వరయ్య, శ్రావణి, గజ్జలకొండ వైద్యాధికారి సాయికిరణ్ పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలతో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయని ఎంపీపీ వెంకట్రావు అన్నారు. మండలంలోని నాగులవరంలో శుక్రవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఎంపీపీ అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, జేసీఎస్ కన్వీనర్ ఏరువ కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

15న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొమరోలు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని రెడ్డిచెర్లలో శ్రీదేవి, భూదేవి మందలపాయ తిరుమలనాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 15న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, 5 వేలు రూపాయలు బహుమతులుగా అందిస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ సాయంత్రంలోపు ఎడ్ల యజమానులు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాల కోసం 99515 38532, 94911 26374 సంప్రదించాలని కోరారు.

రేపు ముగ్గుల పోటీలు

మార్కాపురం: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని నాయుడు బజారులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ గుంటక వనజాక్షి తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 10, 5, 2500 వేల రూపాయలు విలువజేసే పట్టు చీరలు అందిస్తామని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందిస్తామని తెలిపారు. పాల్గొనే వారు ఆదివారం ఉదయం 8 గంటలకు నాయుడు బజారుకు వచ్చి టోకెన్లు తీసుకోవాలని, వివరాలకు 99481 17107 నంబరును సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తర్లుపాడులో రోడ్, బాపూజీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ షియానాయక్ తెలిపారు. రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా రాయవరం, ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కూడా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని సబ్ ఇంజినీర్ సుబ్బరాయుడు తెలిపారు.

కోడుమూరు సమన్వయకర్తగా మంత్రి సోదరుడు సతీష్



డాక్టర్ సతీష్ (ఫైల్)

మార్కాపురం: కర్నూల్ జిల్లా కోడుమూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సోదరుడు మార్కాపురం జార్జి ఫార్మసీ కళాశాల సెక్రటరీ, వైఎస్సార్ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను నియమించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తనకు సమన్వయకర్తగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కోడుమూరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.